# "త్రైలోక్యం మంగళంకురు"

నడిరేయి మూడవ జాము భువన మోహనము, శ్యామ సుందరము అయిన వాన మబ్బు ఒకటి- మానవా కృతి ధరించినట్టుగా, ఆ ఆకృతికి ఆపాదచూడంగా- నవరత్న ఖచిత దివ్యాభరణాలు అమరినట్టుగా, ఆజానుపర్యంతం పారిజాత సుమహారం ధరించిన ఒక ఆకారం అలిపిరి గాలి గోపురం గుండా ఈవలికి వచ్చి మెల్లగా మెట్లు దిగుతూ వుంది.

పచ్చటి గిరి సానువులు చిత్తరువుల్లా నిశ్చలంగా వున్నాయి. పిల్ల తెమ్మెరలు సుగంధాలను వెదజల్లుతున్నాయి. పెళ్లి వారు ఖాళీ చేసిన కల్యాణ మండపంలా మెట్లదారి నిర్జనంగా వుంది.

అప్పుడొక గుండ్రాయిలాంటి వస్తువు ప్రశాంతిని భగ్నం చేస్తూ రివ్వురివ్వుమని పరతెంచి వచ్చి రెండు బారల క్రిందుగా ఒక మెట్టుపైన పడింది. పడిన వస్తువు ప్రేలింది. దట్టంగా పొగ పెల్లుబికింది. ఆ ధూమపుంజం పలచబడిన కొద్దీ అందులోనుంచీ ఒక.... ఒక నల్లటి లిజారువాడు, ఎర్ర చారల బనీను వాడు, గంతల్లో నుంచీ మిడి గుడ్లు మాత్రమే కనిపిస్తున్న వాడు అయిన ఒక ముసుగు మనిషి. పుట్టుకొచ్చేశాడు. నడుముకు బెల్టు, నోటిలో చూయింగ్‌గమ్, చేతిలో రివాల్వర్. ముప్పన్నె మెకం పెడబొబ్బలు పెట్టినట్లుగా అతడన్నాడు- ఆగు అడుగు ముందుకు వెయ్యకు. వేశావ ఖబడ్దార్! రివాల్వర్ ప్రేలుతుంది. ఎత్తు పైకెత్తు. హాండ్సప్!"

శ్రీసతి కొప్పుపైన కపోలతట్టి పైన హంసోత్తరీయం పైన విహరించిన చేతులు, వాత్సల్యంతో భక్తుల్ని పరామర్శించిన చేతులు. ఆ పన్నులకు అభయ మిచ్చిన చేతులు. అయినా సరే ఈ వినోదమేమిటో చూడవలసిందే నన్నట్టు అలవోకగా ఆ చేతులు పైకి లేచాయి. చిరునవ్వుతోనే ఆయన అడిగాడు. 'మానవజాతి పాలిటికి దిష్టి బొమ్మలా

వున్నావు. ఎవరు నాయనా నువ్వు? ఎన్నడూ చూచినట్టు లేదే! ఈ చరాచర ప్రపంచంలో నీ చిరునామా ఏమిటి బాబూ?"

ముసుగు మనిషి– పన్నెండోరీలులో పూరిపాకలకు నిప్పెట్టించిన విలన్‌లా విరగబడి నవ్వాడు. శంకరగిరి మాన్యాలకు బదిలీ అయి పోతున్న ఇంజనీరును చూచి ఇసుక కట్టడాల కంట్రాక్టరు నవ్వినట్టుగా నవ్వాడు. పి. హెచ్‌డి. నిరుద్యోగిని చూచి డొనేషన్ చదువుల డాక్టరు బాబు నవ్వినట్టుగా నవ్వాడు. సాహిత్యం సమాజశ్రేయస్సుకే ననుకునే చాదస్తపు రచయితను చూచి, సాహిత్య వ్యాపారంలో లక్షలు గడించి మేడలు కట్టిన నేటి పాపులర్ రచయితలా నవ్వాడు. నవ్వి నవ్వి అతడన్నాడు. "హాశ్చర్యం, హాశ్చర్యం! నన్నే ఎరుగవా? నువ్వు రాముడివిగా వున్నపుడు రావణుణ్ణి నేనే! నువ్వు నరసింహుడి వైనప్పుడు హిరణ్యకశిపుణ్ణీ నేనే! నీ కృష్ణావతారంలో నరకుణ్ణి నేనే!

పద్మనయనాల్లో విస్మయం సందడి చేస్తుండగా స్వామి అన్నాడు. "ఏం మాట! నిన్నెప్పుడో నేను సంహరించేశానే!"

ముసుగు మనిషి మళ్లీ ఒక వికటాట్టహాసం చేశాడు. "అని నువ్వనుకుంటున్నావు, నన్ను చంపడం నీ తరంగాదు. అప్పట్లో నే నొక్కణ్ణి. ఇప్పుడు నా అంశలో వేనకు వేలు పచ్చి రక్తం గుటుగుటత్రాగే టెర్రరిస్టును నేను! దేశ సంపదను పరాధీనం చేసే స్మగ్లర్ని నేను. మాతృభూమిని వేలంపాటలో పెట్టే విదేశీ ఏజంటును నేను. యువతను మత్తు జాడ్యంలో ముంచే మాఫియా కింగుని నేను. సాడిస్టుని నేను. సంఘ విద్రోహిని నేను. దోపిడీ నాహాబీ. విధ్వంసం నా వినోదం. హింస నా వృత్తి. అరాచకం నా ప్రవృత్తి....."

కరిని గారించిన మకరి వైపు దూసుకుకెళ్లిన నిశిత వీక్షణాలు స్వామి కంటి కొసల్లోనుంచే ప్రసరించాయి. "ఛోరి పాషండుడా! నికృష్టపు పనులు చేసింది చాలక, అందును గురించి గొప్పలుచెప్పుకోడం కూడానా!" ఆయన స్వరంలో విభ్రాంతి, కినుక, జుగుప్స ముప్పేటగా ధ్వనించాయి.

"అసలు– గొప్పలు చెప్పుకోవలసిందే నేను!" ముసుగు మనిషి ముదలం కించుకున్నాడు "ఒయీ మాయా నాటక సూత్రధారీ! నా ప్రతిజ్ఞ ఏమిటో చెబుతున్నాను విను. మానవ జగత్తును సైతాన్ సామ్రాజ్యంగా మార్చిగానీ నేను నిద్రపోను. ఇంకా పూర్తి కాలేదు గానీ, ఆ పని ఏనాడో ప్రారంభమైంది. ఇప్పుడు కొనసాగుతూ వుంది. నీతిపరుడి నొసట నేను ప్రయోజకుడు అని రాసి పెట్టాను. అవినీతి పరుణ్ణి అందలం

ఎక్కించాను. శ్రమజీవి డొక్కలో ఆకలి మంటలు రగిలించాను. పరభాగ్యోప జీవిపొట్టను బొట్టలాగా పెంచాను. చదువులు, పదవులు అంగం వస్తువులుగా చేశాను. సాహిత్య సంగీతాది సమస్త కళల్నీ రూకల కోసం తైతక్కలాడే పడుపుకత్తెలుగా మార్చాను. త్యాగధనుల్ని పిచ్చి పుల్లయ్యలుగా నిరూపించాను. స్వార్థపరుల మెడల్లో పూల దండలు గుప్పించాను జీవితంలో బహు పాత్రాభినయం చేసే వాళ్ల సంఖ్యను పెంచాను. హీరోయిన్లను వాంపుల స్థాయికి దించాను. ఇంకా చాలా వున్నాయిలే! అవన్నీ ఎందుగ్గానీ, ప్రస్తుతానికొస్తున్నా! ఏదీ ఆ మకర కంఠహారం తియ్! సహస్రనామహారం, లక్ష్మీహారం, చంద్రహారం ....ఉండుండు, ముందుగా వజ్ర కిరీటం...."

స్వామి పెదవులు ముడి నడ్డాయి. నేత్రాల్లో అరుణిమ ప్రాకింది. సంకల్ప మాత్రంలో సుదర్శనం చనుదెంచి తన పని నెరవేర్చింది. ముసుగు మనిషి మొండెం నుంచీ తల వేరై పోయింది. దివి నుంచీ పూలవానలు కురిశాయి. గంధర్వులు ఆనంద నృత్యం చేశారు. కిన్నరులు విజయగానం అందుకున్నారు. "నీదాకా వస్తేగానీ, నరుల బాధ నీకు తెలిసిరా లేదా స్వామీ?" ప్రశ్నిస్తూ నారద మహర్షి ప్రవేశించాడు.

"అదేమిటి నారదా! నరుల బాధలకు కారకుణ్ణి నేనా?" భగవానుడు ఆశ్చర్యపడిపోతూ అడిగాడు– "వాళ్లు తమదారిలో తామే గోతులు త్రవ్వుకుంటున్నారు. తమ వ్రేలితో తమ కన్నే పొడుచుకుంటున్నారు. సరసద్వివేకం కోసం మనం బుద్ధిని ప్రసాదించాం. వాళ్లు బుద్ధిమంతులుగా ఉండాలన్నది మన ఆకాంక్ష. దుష్ట శక్తులేవైనా పొడసూపితే వాటిని వాళ్లు మొదట్లోనే, మొదలంటూ త్రుంచి వేయాలన్నది మన అభిమతం. అందుకు విరుద్ధంగా వాళ్లు తాముత్రవ్విన గోతులలో తామే పడిపోతున్నారు. తమ కళ్లను తామే పోగొట్టుకుంటున్నారు. అందులో నా బాధ్యతేమీ లేదే!"

తప్పు, తప్పు అన్నట్లుగా లెంపలు వేసుకున్నాడు నారదుడు– "అంత మాటన గలనా స్వామీ! లేదంటే జనావళికి శుభాలు మాత్రమేకలగాలని ఆశించడం నా వంతు. అందువల్ల ఈ కథకు ఫలశ్రుతి మాత్రం కోరుకుంటాను– అదీ మీ సెలవైతే?" అంటూ అర్థించాడు.

స్వామి ఆమోద సూచకంగా తల సంకించాడు.

"అయితే యిట్లాగనుగ్రహించు స్వామీ! కులాలకు, డబ్బులకు– పరిపాలకులను ఎన్నుకునే ఆస్కారం లేకపోవునుగాక! మేధావులు– తమ గజదంత గోపురాల నుంచి

దిగి వచ్చి, ప్రజలతో కలిసి మెలిసి వుంటూ వారికి మార్గ దర్శకులవుదురుగాక. కవులు– పదాలు నడిపించినట్లుగా గాక గుండెలు పలికించినట్టుగా కవితలు వెలయింతురుగాక! దొంగలు, రవుడీలు, కేడీలు కథానాయకులుగా గణన కెక్కే గర్భ దరిద్రపు కక్కుర్తి కాలం గతించునుగాక! కాపురాల్లో కుల కాంతలకు భద్రమగును గాక!" బడిలో అలజడి ఉపశమించునుగాక! ఆఫీసుల్లో ఫైళ్లు సంచలించునుగాక!...."

"మంచిది, మంచిది. అట్లాగే నారదా! నన్నికనైనా ముందుకు వెళ్లనివ్వు" మెట్టు దిగ బోయారు స్వామి.

"అదెట్లా వీలవుతుంది. "స్వామీ!" అడ్డుతగిలాడు నారదమహర్షి. "వేగు చుక్క పొడవటానికట్టే వ్యవధి లేదు. వేకువజాము మొదలైంది. సుప్రభాత సేవకు వేళయింది. కావలిస్తే అమ్మవారితో నేను మనవిచేస్తాను తమరింక వెనుదిరిగి వెళ్ల వలసిందే!" మరి కొంత సేపటకి శేషాచల శిఖరాలలో నుంచీ మేలు కొలుపు ప్రతిధ్వనించింది.

"ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవిన్ద!
ఉత్తిష్ఠ గరుడధ్వజ!
ఉత్తిష్ఠ కమలా కాన్త!
త్రైలోక్యం మంగళంకురు"

(కామధేను)

⊛ ⊛ ⊛